క్లుప్తంగా

క్రికెట్ పోటీలు ప్రారంభం



పెబ్బేర్‌రూరల్: శ్రీరంగాపురం మండలంలోని జానంపేట గ్రామ ప్రీమియం లీగ్ క్రికెట్ పోటీలను సోమవారం సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. పోటీల నిర్వహణలో ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా శాంతియుతంగా నిర్వహించుకోవాలని క్రీడాకారులకు సూచించారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివుడు, మాజీ ఉపసర్పంచ్ ఉమర్‌ఫారుఖ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



పాన్‌గల్: మండలంలోని మాందాపూర్‌కు చెందిన రాణికి మంజూరైన రూ.18 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు పరమేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధితో పేదలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే అవకాశం కలుగుతుందన్నారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంజూరు చేయించిన కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి, మంజూరుకు కృషి చేసిన మండల ప్రజాప్రతినిధులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గిరిధర్ పాల్గొన్నారు.

వనపర్తి వాసి ప్రతిభ

వనపర్తి: ఈనెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జడ్జెస్ ట్రెనింగ్ ప్రోగ్రాంలో పట్టణానికి చెందిన సుగుణ ప్రతిభ కనపరిచారు. ఆమెకు సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

ఆత్మకూర్ కమిషనర్‌గా నాగరాజు



ఆత్మకూర్: స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా నాగరాజు సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. కొత్తగూడెం జిల్లా మనుగూరు కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగరాజు బదిలీపై ఇక్కడకు వచ్చారు. మున్సిపాలిటీ అభివృద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకుంటూ ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉంటానని, ప్రజలు సహకరించాలని కోరారు.

రైతులు ఆందోళన చెందొద్దు

పాన్‌గల్: వరి ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మండలంలోని చిక్కేపల్లిలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలస్వామియాదవ్, సీఈఓ భాస్కర్‌గౌడ్, వెంకట్‌రాములుయాదవ్, ధర్మారెడ్డి, ఖాదర్, బిచ్చాల్, రైతులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

గోపాల్‌పేట: దేశాన్ని నడిపిస్తున్న రాజ్యాంగంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ధర్మసమాజ్ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం ధర్మసమాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తెలంగాణ తల్లి చౌరస్తా నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందించారు.

పాన్‌గల్: ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధినాయకులు డా.విశారధన్ మహారాజ్ ఆదేశాల మేరకు భారత రాజ్యాంగ పుస్తకాన్ని ప్రతి ఇంటికి పంపిణీ చేయాలని ధర్మ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ బాల్‌రాం, మండల నాయకులు అరుణ్‌కుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇన్‌చార్జ్ తహసీల్దార్ మతీన్‌కు అందజేశారు. ఆంజనేయులు, రామకృష్ణ, లక్ష్మణ్, శివ, అశోక్, నరసింహ, రాజు, ఖాసీం, గోపాల్, కృష్ణ, అంజి తదితరులు పాల్గొన్నారు.

విస్తరణకు సహకరించాలి

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్ నుంచి రామ థియేటర్ రోడ్డు వరకు కేవలం నాలుగు ఇళ్ల యజమానులు సహకరించకపోవడంతోనే విస్తరణ పనులు ఆగిపోయాయని మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్ పేర్కొన్నారు. సోమవారం ఆ యజమానులకు ఫోన్ చేసి మాట్లాడారు. వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 90శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. అలాగే పట్టణంలోని పాతబజార్ రోడ్డులో విస్తరణ పనులను, డ్రెయినేజీలను పరిశీలించారు.

సాగునీటితోనే భవిష్యత్‌కు బాటలు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- దొంతికుంట తండాలో కాల్వపనులు ప్రారంభం
- నూతన గ్రామ పంచాయతీ భవనాలు, బీటీ రోడ్లకు భూమిపూజ
- పాల్గొన్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



షాపురం ఊరంచుతండా బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సాగునీరు అందించి భావితరాల భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఖిల్లాఘనపురం మండలంలోని దొంతికుంటతండా సమీపంలో 500 ఎకరాలకు సాగునీరు అందించే కాల్వపనులను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి ప్రారంభించారు. కర్నెతండా, వెనికితండా, హీర్లతండాల్లో గ్రామ పంచాయతీ భవనాలకు భూమిపూజ చేశారు. రూ.1.30 కోట్లతో చేపట్టే షాపురం తండా రోడ్డు పనులకు, రూ.55 లక్షల వ్యయంతో చేపట్టే దేవబండతండాలో రోడ్డు పనులతో పాటుగా మామిడిమాడలో రూ.24 లక్షలతో నిర్మించే హెల్త్ సబ్‌సెంటర్, రూ.12 లక్షల వ్యయంతో నిర్మించే ఎస్సీ కమ్యూనిటీహాల్ భవనానికి ఆయన భూమిపూజ చేశారు. రూ.72 కోట్లతో కర్నెతండా ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నామని, మరో మూడు నెలల్లో మోటార్లు బిగించి 550 అడుగుల ఎత్తున ఉన్న ప్రాంతాలకు సాగునీరు అందిస్తామని అన్నారు. ప్రతి గిరిజన తండాకు బీటి రోడ్డు వేయిస్తామన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యులు సామ్యనాయక్, పంచాయతీరాజ్ శాఖ ఈఈ మల్లయ్య, డీఈ ప్రమోద్ రావు, ఏఈ కబీర్‌దాసు, నీటిపారుదల శాఖ డీఈ సత్యనారాయణ, మండల సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, జిల్లా మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు బాలీశ్వర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మండల రైతు సమితి చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, డైరెక్టర్లు సత్యం, శ్యాంసుందర్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ క్యామరాజు, మండల టీఆర్‌ఎస్ అధ్యక్షుడు కృష్ణయ్య వివిధ గ్రామాల సర్పంచ్‌లు పీనానాయక్, శాంతి, బాలాంజనేయులుగౌడ్, రాజునాయక్, మోహన్‌జీ, శాంత, దేవేందర్ ముదిరాజ్, గోపాల్ నాయక్ వివిధ గ్రామాల నాయకులు బుచ్చిబాబుగౌడు, శంకర్‌గౌడు, కృష్ణయ్య, చెన్నయ్య, సత్యనారాయణ, రాంచంద్రి, వెంకటేష్, సామల ఆంజనేయులు, విష్ణు, నాగయ్య ఉన్నారు.

రాళ్లు ఇలా.. నీరు పారేది ఎలా?



జూరాల ప్రధాన కాల్వ బ్రిడ్జి కింద పడిన రాళ్లు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని జేగురుదత్త దాబా వెనకాల జూరాల ప్రధాన కాల్వపై ఉన్న బ్రిడ్జి కింద రాళ్లు వేయడంతో దిగువ ప్రాంతానికి నీళ్లు ఎలా పారుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ భూములకు రైతులు, మత్స్య కళాశాలకు విద్యార్థులు ప్రతి రోజు జూరాల కాల్వపై ఉన్న ఈ బ్రిడ్జినే దాటి వెళ్తుంటారు. బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో కూలేందుకు సిద్ధంగా ఉంది. జూరాల కాల్వలను పరిశీలించే అధికారులు ఇటు వైపు కూడా రాకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో దానికి మరమ్మతు చేయకపోతే వచ్చే వర్షాకాలంలో దిగువ ప్రాంతాలకు సాగునీరు పోయేందుకు ఇబ్బందులు తప్పవని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జూరాల ప్రధాన కాల్వ మరమ్మతు చేయాలని పలువురు రైతులు కోరారు.

వీఓఏల రౌండ్ టేబుల్ సమావేశం

మదనాపురం: వీఓఏల ఆందోళనలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో వీఓఏలు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ మాట్లాడుతూ తక్కువ వేతనాలతో వీఓఏలు పనిచేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి వేతనాలను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రజానాట్యమండలి కళాకారులు వెంకటేష్, ప్రసాద్, వీఓఏల సంఘం ఉపాధ్యక్షుడు మన్యం, కార్యదర్శి స్వప్న, కోశాధికారి జమ్ములు, వీఓఏలు జయమ్మ, శ్రీలత, అరుణ, క్రాంతి, రాజేశ్వరి, సంధ్య,నారాయణ, మునికుమార్, ఖాదర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సోళీపురం పంచాయతీకి జాతీయ స్థాయి ప్రశంసాపత్రం



ఖిల్లాఘనపురం: దేశంలో వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన గ్రామ పంచాయతీలకు కేంద్రప్రభుత్వం దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయత్ స్టేట్ వికాస్ పుస్కార్ అవార్డులను ప్రకటించింది. 2021–22 సంవత్సరానికి గాను ఖిల్లాఘనపురం మండలంలోని సోళీపురం పంచాయతీ 'పేదరిక నిర్మూలన ప్రజల జీవన ప్రమాణాల పెంపు' అనే అంశంలో రాష్ట్ర స్థాయిలో బహుమతిని గెలుపొందింది. ఇందుకుగాను కేంద్ర ప్రభుత్వం అందించిన ప్రశంసాపత్రాన్ని సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలో వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ చేతులమీదుగా సర్పంచ్ పద్మశ్రీ బాలీశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, ఎంపీఓ రాజు అందుకున్నారు.

రంగాపూర్‌లో ఇథనాల్ కంపెనీ ఎత్తివేయాలి



మాట్లాడుతున్న చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు

పెబ్బేరు: మండలంలోని రంగాపూర్ సమీపంలోని ఇథనాల్ కంపెనీని ఎత్తివేయాలని సోమవారం చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు డిమాండ్ చేశారు. కమిటీ సభ్యులు కంపెనీని పరిశీలించిన అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కంపెనీకి అవసరమైన నీటిని నిరంతరాయంగా కృష్ణానది తీసుకోని మళ్లీ వ్యర్థ జలాలను సైతం నదిలోకి వదిలేస్తున్నారన్నారు. అలాగే కంపెనీ చుట్టూ పంట పొలాలకు, కాల్వలకు కాలుష్యం, వ్యర్థాలు, నీళ్లు వదులుతుండడంతో రైతులు, ప్రజలు, మూగజీవాలు దుర్వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. దీంతో రైతులు తమ పొలాలను కంపెనీ యజమానులకే కారు చౌకగా అమ్మివేసి, వ్యవసాయ చేయకుండా వెళ్లిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఈ కంపెనీ నుంచి వస్తున్న వ్యర్థ నీళ్లు తాగి అనేక మూగజీవాలు మృత్యువాత పడ్డాయని, కంపెనీలో నీళ్లు, ఆహార ధాన్యాలు, చెరుకు, మక్కలు, బియ్యపు నూకలను కలిపి రోజుకు 1.20 లక్షల లీటర్ల మద్యం తయారు చేయడంతో.. వాటి వ్యర్థాల కాలుష్యం కోరలో చిక్కుకుని పశువులు, గ్రామాలు, పంట భూములకు భద్రత లేకుండా పోయిందని, ఇథనాల్ పాలసీని వ్యతిరేకించి ఈ కంపెనీ ఎత్తివేసే దాకా పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవచారి, ఆల్ ఇండియా కన్వీనర్ బండారి లక్ష్మయ్య, వనపర్తి జిల్లా కన్వీనర్ ఈరప్పాగ గోవిందు, కురుమయ్య, మధు, సతీష్, ఎక్లాస్పూర్ యువక మండలి సభ్యులు పాల్గొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

వనపర్తి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన మండల పరిషత్ ప్రత్యేక సమావేశం కోరంలేని కారణంగా వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ సుదర్శన్ తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు, మండల పరిషత్ షాపుల వేలం తదితర తీర్మానాల కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయగా.. 11 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను కనీసం ఐదుగురు కూడా హాజరు కాని కారణంగా సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు.

ప్రజావాణికి దరఖాస్తులు కరువు



తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణికి హాజరైన అధికారులు

అమరచింత: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి వినతులు కరువయ్యాయి. కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ కార్యాలయాల్లోనే ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించాలనే సూచనలతో తహసీల్దార్ షేక్ చాంద్‌పాషా ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమానికి ఎంపీడీఓ జ్యోతిపరుషియా, ఎస్‌ఐ శివనాగేశ్వర నాయుడు, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖల అధికారులు రెండో వారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరుకాక పోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రంలో ప్రజావాణి నిర్వహిస్తున్నామని గ్రామాల్లో ప్రచారం చేయక పోవడమే ఇందుకు కారణమని ఆయా గ్రామాల ప్రజలు అన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజావాణిపై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

డయాలసిస్ సెంటర్‌లో సమస్యలు పరిష్కరించాలి



వనపర్తి: స్థానిక జనరల్ ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీషయాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం డయాలసిస్ సెంటర్‌ను ఆయన తన బృందంతో కలిసి సందర్శించారు. డయాలసిస్ చేయించుకున్న వారితో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వేసవిలో సరిపడా ఫ్యాన్లు, ఏసీలు లేకపోవడంతో బెడ్లపై పడుకోలేని పరిస్థితుల్లో డయాలసిస్ చేయించుకుంటున్నామని బాధితులు తెలిపారు. ఐదు ఏసీలకు గాను ప్రస్తుతం రెండు ఏసీలు ఉండగా.. కేవలం ఒక్కటే పనిచేస్తోందని, ప్రస్తుతం ఉన్న 10 డయాలసిస్ మిషన్లకుగాను కనీసం ఐదు ఏసీలు ఉండాలని వారు చెప్పారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రాములు, శ్రీనివాసులు, జనార్దన్ గౌడ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల్లో మత విద్వేషాలు రెచ్చగొట్టొద్దు'



ప్రజాపోరుయాత్రను నిర్వహిస్తున్న నాయకులు

ఆత్మకూర్: దేశంలో ప్రజల మధ్య మత విద్వేషాలు రేపుతూ దేశ ఐక్యతకు తూట్లుపొడుస్తున్న మోడీ పాలనకు అంతమొందించేందుకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఐ జిల్లాకార్యదర్శి విజయరాములు అన్నారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో బీజేపీ హటావో దేశ్ కో బచావో అంటు ప్రజా పోరు యాత్రలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో మోడిప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించారని, ప్రభుత్వరంగ సంస్థలను అప్పనంగా ఆదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఆట, పాటలతో ప్రభుత్వ తీరును కళాకారులు ఎండగట్టారు. కార్యక్రమంలో అబ్రహం, రాబర్టు, నర్సింహశెట్టి, మోష, భాస్కర్, సురేష్, లక్ష్మీనారాయణశెట్టి,నాగరాజు, మషప్ప, కుతుబ్, కతలప్ప, ఎర్రన్న, తదీతరులు ఉన్నారు.

పాన్‌గల్: దేశ భక్తులమని చెబుతున్నా బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను సంతలో సరుకుల మాదిరిగా కార్పొరేటు శక్తులకు అమ్మేస్తున్నారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎండీ ఫయ్యాజ్ ఆరోపించారు. ఇంటింటికీ సీపీఐ పాదయాత్రలో భాగంగా మండలంలోని కదిరెపాడు, శాగాపూర్, మాధరావుపల్లి గ్రామాల్లో పర్యటిస్తూ మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్, ప్రేమ్‌కుమార్, కిరణ్, శివుడు, మండల కార్యదర్శి కుర్మయ్య, పెంటయ్య, కాశన్న తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలి



పాన్‌గల్: మండలంలో కమ్యూనిటి బేస్ (సీబీఓఎస్) ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గ్రామిక వికాస కేంద్రం మండల కోఆర్డినేటర్ కాశయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మండలంలో గురుకుల పాఠశాల ఏర్పాటుతో పేద పిల్లలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీద్, అంజి, సురేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వనపర్తి: రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడిన ఘటన సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఎస్టీ థామస్ స్కూల్ సమీపంలో చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీపనగండ్ల మండలంలోని కల్వరాలకు చెందిన వెంకటయ్య అనే వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. గాయాలపాలైన ఆయనను 108 లో ఆస్పత్రి తరలించి చికిత్స అందించారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం: కలెక్టర్



యువ ఉద్యోగులను అభినందిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

వనపర్తి: ఒకరు చేసే రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లోని వెయిటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు జీన్ హెన్రీ ట్యూన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రక్తదానం చేసిన యువఉద్యోగులను అభినందించారు. 2022లో అత్యధికంగా సభ్యత్వం నమోదు చేయించిన డీపీఓ సురేష్, డీఆర్‌డీఓ నర్సింహులుకు జ్ఞాపిక అందజేశారు. స్థానిక తహసీల్దార్ రాజేందర్‌గౌడ్‌కు పోషకుడు సభ్యత్వ నమోదు కార్డును అందించి సన్మానించారు. అత్యధికంగా రక్తదానం చేసిన ఎం.డీ. అమర్‌ను ప్రశంసించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ ఖాజా కుతుబుద్దీన్, డాక్టర్ చైతన్యగౌడ్, సాంకేతిక సిబ్బంది లక్ష్మీపతి, వహీద్, మహమూద్ రమేష్, స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

విస్తరణ పనులు పూర్తి చేయాలి: కలెక్టర్

వనపర్తి టౌన్: పట్టణంలో రోడ్ల విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న పనులను ఆయన మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్‌తో పాటు పరిశీలించారు. ఈ మేరకు విస్తరణ పనుల పురోగతిపై ఆరా తీశారు. అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్ల విస్తరణకు ప్రజలు సహకరించాలని, ప్రజల సహకారంతోనే పనులు త్వరగా పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో డీఈ సూర్యనారాయణ, టీపీఓ వరప్రసాద్, ఏఈ భాస్కర్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధితోనే ఆర్థిక స్వావలంబన

పెబ్బేరు: మండలంలోని రంగాపూర్, అయ్యవారిపల్లిల్లో పీఎంఈఎంఈ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ ద్వారా మిరప పొడి మిషన్లను సోమవారం జెడ్పీటీసీ పద్మ, ఎంపీపీ ఆవుల శైలజ, అదనపు డీఆర్‌డీఏ రేణుక ప్రారంభించారు. ఫర్దాన్ మాంత్రి ఫార్మాలేషన్ ఆఫ్ ఫుడ్ ప్రాసెంగ్ యూనిట్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు అయ్యవారిపల్లికి చెందిన భాస్కర్‌గౌడ్, రంగాపూర్‌కు చెందిన వడ్ల సునీత, కృష్ణయ్య చిల్లీ పౌడర్ మిషన్లకు, భారతమ్మ పికిల్స్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు గట్టయ్య, స్వాతిగౌడ్, నాయకులు కురుమూర్తి, వెంకటేష్, ప్రభాకర్‌గౌడ్, గ్రామ, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండానే



జెండాను ఎగుర వేస్తున్న సీపీఎం నాయకులు

పాన్‌గల్: కష్టజీవులు, కార్మికులు, రైతులు, వృత్తిదారులకు అండగా ఉంటూ వారి సమస్యలపై పోరాడుతూ వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నది సీపీఎం అని మండల కార్యదర్శి దేవేందర్ అన్నారు. మే డే ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని కేతేపల్లిలో గ్రామ పార్టీ కార్యదర్శి నరేందర్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేటు శక్తులకు అండగా ఉంటూ పేద వర్గాలను విస్మరిస్తుందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సకల జనులను చైతన్యం చేస్తూ ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో భీమయ్య, జమ్ములయ్య తదితరులు పాల్గొన్నారు.

దుంపాయికుంట లబ్ధిదారులకు న్యాయం చేయండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న జాన్‌వెస్లీ, జబ్బార్

అమరచింత: పట్టణంలోని సర్వేనంబర్ 586, 587లోని దుంపాయికుంటలో నిరుపేదలకు ఇంటి నిర్మాణాల కోసం ఇచ్చిన స్థలం పట్టాల లబ్ధిదారులకు న్యాయం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వేస్లీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్‌తో కలిసి మక్తల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి సోమవారం సీపీఎం నాయకుల బృందం వెళ్లారు ఎమ్మెల్యేను కలిశారు. 1997లో దుంపాయికుంటలో నిరుపేదలకు ఇంటి స్థలాల కోసం పట్టాలను అందించారన్నారు. ప్రస్తుతం లబ్ధిదారులు తమకు అందించిన పట్టాల ప్రకారం స్థలం పొజిషన్లు చూపాలంటూ ఎనిమిది నెలలుగా గుడిసెలు నిర్మించుకుని అక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారని తెలిపారు. నిరుపేదలు ప్రస్తుతం సొంతంగా స్థలాలను కొగుగోలు చేసి ఇంటిని కట్టలేని స్థితిలో ఉన్నారని ఎమ్మెల్యేకు వివరించారు. ప్రభుత్వం చొరవ చూపి ఇంటి నిర్మాణాలకు అనుమతులతో పాటు డబుల్ బెడ్‌రూంలను మంజూరు చేయాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యను పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు మహమూద్, మండల కార్యదర్శి జీఎస్ గోపి, వెంకటేష్, ఆర్‌ఎస్ రమేష్, అజయ్, బుచ్చన్న, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు వివరాల సేకరణపై బీఎల్‌ఓలకు అవగాహన



మాట్లాడుతున్న ఆర్‌ఐ తిరుపతయ్య

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఒకే ఇంట్లో ఆరు మంది నుంచి ఆపైగా ఉన్న ఓటర్ల వివరాల సేకరణపై సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ తిరుపతయ్య మాట్లాడుతూ.. బీఎల్‌ఓల పరిధిలో ఉండే వివరాలను పకడ్బందీగా సేకరించాలని, ఆ సంఖ్య అంతకన్నా ఎక్కువ మంది ఓటర్లు ఉండే ఇంటికి సంబంధించిన ఓటర్ల వివరాలు ఆ ఇంటి నెంబర్‌లోనే ఉన్నాయా వేరు, వేరు అడ్రస్‌లపై ఉన్నాయా, ఫోన్ నెంబర్లు, చిరునామా వివరాలు సరిగా ఉన్నాయా.. మార్పులు చేయాలా అనే విషయాలను సేకరించాలన్నారు. దీంతో పాటు చనిపోయిన ఓటర్లు ఉంటే వారి వివరాలను తీయాలన్నారు. ఆయా వివరాలను సేకరించి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ గంగాధర్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

సైనిక్‌స్కూల్‌కు విద్యార్థి ఎంపిక



ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌కు చెందిన అఖిలేష్ సైనిక్‌స్కూల్‌కు ఎంపికయినట్లు లిటిల్‌ఫ్లవర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు మీర్జాఅన్వర్ బేగ్, అక్తర్‌బేగ్ తెలిపారు. కరీనగర్‌లోని రుక్మాపూర్ సైనిక్‌స్కూల్లో చేరేందుకు పరీక్షకు హాజరుకాగ రెండో లిస్టులో ఆరో తరగతిలో చేరేందుకు ఎంపికయినట్లు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వనపర్తి: జిల్లా కేంద్రంలో ఆటోలు నడుపుతున్న డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ డీకె మహేశ్వర్‌రావు సూచించారు. సోమవారం ఆయన వారిని తన కార్యాలయానికి పిలుచుకుని ఈ విషయంపై మాట్లాడారు. ప్రమాదాలు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్, లైసెన్స్, పొల్యూషన్ ధ్రువపత్రాలను డ్రైవింగ్ చేసే సమయంలో తప్పనిసరిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్‌ఐ నిరంజన్, సిబ్బంది పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

వనపర్తి: మండలంలోని చిట్యాలలో అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి తన రేకుల షెడ్‌కు సీఎంఆర్ అనుమతి పొంది ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కారు. ఈ విషయంపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సోమవారం బీజేపీ నాయకులు బి.కృష్ణ, రామన్‌గౌడ్, పెద్దిరాజు, తదితరులు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు ఫీల్డ్ విజిట్ చేస్తే.. ఇప్పటికింకా మిషనరీలు లేని రేకుల షెడ్‌ను చూడవచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు.

యూత్ డిక్లరేషన్‌తో యువతకు మేలు



పెబ్బేరు నుంచి నిరుద్యోగ నిరసన సభకు బయలు దేరుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న కేశం నాగరాజుగౌడ్

ఆత్మకూర్: రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు మేలు జరుగనుందని, అందులో భాగంగానే ప్రియాంకగాంధీ యూత్ డిక్లరేషన్ ప్రకటించారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, రాష్ట్ర నాయకులు కె.ప్రశాంత్ కుమార్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన విద్యార్థి, నిరుద్యోగ జంగ్‌సైరన్ సభకు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. కార్యక్రమంలో అయ్యూబ్‌ఖాన్, తులసీరాజ్, రహ్మతుల్లా, మహేందర్‌రెడ్డి, అక్కి శ్రీనివాస్‌గౌడ్, విజయ వర్ధన్‌రెడ్డి, గంధం రాజశేఖర్ పాల్గొన్నారు.